
# సమతారేఖ



ఊరకరారు మహాత్ములు! ఏమిటివాళ ఇలా వచ్చావ్? ఎవరీ అబ్బాయి?'


'మామేనల్లుడే. పేరుమాధవ్. ఎం.బి.ఎ. చేశాడు ఈ మధ్యనే'.

'రా, కూర్చో. నువ్వూ కూర్చోవోయ్...ఊ(, ఏమిటి, ప్రేమ కేసా?'

'ఏం , కేసు విషయంలో తప్ప నీ దగ్గరికి ఎవరూ రాకూడదా? కామిర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు నీకు ప్రతీదీ కేసు లాగే కనిపిస్తుంది! అయినా, నీకేమన్నా కర్ణపిశాచి ఉందా, లేకపోతే మీ లాయర్లకి మొహం చూడగానే మనసులో ఏముందో తెలుసుకునే నైపుణ్యం ఉంటుందా?

'ఈ మాత్రం దానికి పిశాచం దాకా ఎందుకు? అంత నైపుణ్యం దేనికి? నువ్వు రాకారాక వచ్చావు. మేనల్లుణ్ణి కూడా తీసుకొచ్చావు. చదువు గురించి చెప్పావు. ఉద్యోగం గురించి భయం ఉన్నట్టు లేదు. కుర్రవాడు తెలివైన వాడిలాగే ఉన్నాడు. కాని దిగులుగా ఉన్నట్టు కనిపిస్తున్నాడు. ఊరికే, ఓరాయి విసిరి చుశాను, అంతే'.

'సెభాష్! మావాడు ఆవలించకుండానే వాడి పేగులు లెక్కపెట్టావు! నువ్వన్నది నిజమే కానీ, అసలు సంగతి - వీడు బెంగుళూరు వెడుతున్నాడు. రైలు రెండుగంటలు లేటు అని తెలిసింది. ఈ లోగా మా ఇంటికి వెళ్లి రావడం కష్టం కదా! సరే, ఆ స్టేషన్లో పడి ఏడవడమో,




రోడ్లమ్మట తిరగటమో ఎందుకనీ, నిన్ను కలుసుకుని చాలా కాలమైందనీ ఇలా వచ్చాం. నువ్వేం పని హడావిడిలో లేవు కదా?' 'చూస్తున్నావుగా, ప్రస్తుతానికి వేరే కేసులేం లేవు. మీది తప్ప!'

'మాది నీ దగ్గరకొచ్చే కేసు కాదులే!'

'ఇంతకీ మీ వాడి సమస్య ఏమిటి? ... రహస్యం కాకపోతేనే చెప్పు'.

'ఇంతకు ముందు రహస్యమేమోకాని, ఇప్పుడు నాదాకా వచ్చాక ఇంక నీ దగ్గర రహస్యం దేనికి?... వీడు పాపం, ఓ పిల్లని ప్రేమించాడు, పెళ్లి చేసుకుంటానంటే తల్లి దండ్రులు అడ్డుపడుతున్నారు'.



'సరే, మామూలు కథే కదా. ప్రేమించడం పాపం అన్నట్లు ముందు అలాగే అడ్డుపడతారు తల్లిదండ్రులు. తీరా చెప్పకుండా పెళ్లి చేసుకు వస్తే, కొన్నాళ్లు బెట్టు చేసినా తరవాత క్రమంగా వాళ్లే దారి కొస్తారు. ముందే గ్రేస్‌ఫుల్‌గా అంగీకరించ వచ్చుకదా. కాని అలా చెయ్యరు'.

అబ్బూరి ఛాయాదేవి

'నువ్వనుకున్నంత సులభం కాదులే వీడి వ్యవహారం. వీడిదీ ఆ పిల్లదీ ఒక కులం కాకపోవడం కాదు, ఒక మతం కూడా కాదు'.

మా ఇద్దరికీ ఏ కులమూ ఏ మతమూ లేదు. మా తల్లిదండ్రులకే అవన్నీ'.

'ఉండరా మాధవా. నన్ను చెప్పనీ.నా ఉద్దేశమూ అదే.. మీవి వేరువేరు మతాలన్న ఉద్దేశం మీకుంటే ప్రేమించుకుని పెళ్లిదాకా ఎందుకొస్తారు? మీ కుటుంబాల మాటే నేచెబుతున్నది'.

'ఆ అమ్మాయికి కూడా మైనారిటీ తీరిందా?'

'ఓ, భేషుగ్గా. వీళ్లిద్దరూ క్లాస్‌మేట్సే'.


'తల్లిదండ్రులు మరీ సనాతనులూ, ఛాందసులూనా?'

'అదీకాదు. అక్కడే ఉంది గమ్మత్తు! మాధవ్ వాళ్ల పక్కవాటాలో వీడి గర్ల్‌ఫ్రెండ్ - పేరు చెప్పలేదుకదూ, ఎలీనా- ఆ అమ్మాయి పెద్దనాన్న కుటుంబం ఉంటోంది. ఆ పెద్దనాన్న మనవలిద్దరూ ముద్దొస్తూ ఉంటారు. చురుగ్గా ఉంటారు. కుర్రవాడి ముద్దుపేరు "మోజు" - అసలు పేరు మోజెస్. వాడి అక్క పేరుమెర్సీ. వాళ్లెప్పుడూ మాధవ్ వాళ్లింట్లోనే ఆడుకుంటూ ఉంటారు. వాళ్లింట్లోనే టిఫిన్లూ, అప్పుడప్పుడు భోజనం కూడాను. వాళ్లింట్లో చేసిన ఫలహారాలు వీళ్లింటికీ, వీళ్లింట్లో చేసిన పచ్చళ్లూ ఊరగాయలూ వాళ్లింటికీ సరఫరా అవుతూ ఉంటాయి. ఎలీనా హాస్టల్లో ఉండేది. వాళ్ల పెద్దనాన్న ఎలీనాకి లోకల్ గార్డియన్, తల్లిదండ్రులు ప్రస్తుతం బెంగుళూరులో ఉంటున్నారు. తండ్రి రైల్వేలో పని చేస్తున్నాడు. ఆయనకి ట్రాన్స్ఫర్లు అవుతూ ఉంటాయి. అందుకని ఎలీనా హాస్టల్లో ఉండేది. పెద్దనాన్న ఇంటికి రాకపోకలు సాగించడంలో, ఎలీనా చనువుగా తిరిగేది మాధవ్ ఇంట్లో - పెద్దనాన్న మనవలతో పాటు మాధవ్‌తో స్నేహం ప్రేమగా రూపొందింది. ఆ సంగతి పెద్ద వాళ్లు కనిపెట్టలేదు. అసలు అనుమానం కూడా రాలేదు. అనుమానం రానంత మర్యాదగానే మసులుకునేవారు మాధవ్వూ, ఎలీనా. అయితే, వీళ్లకీ అనుమానం రాలేదు తమ ప్రేమకి తల్లిదండ్రులు అడ్డుపడతారని. మాధవ్ తల్లిదండ్రులు అంత ఆప్యాయంగా చూసేవారు ఎలీనాని. పుట్టిన రోజుకీ, క్రిస్‌మస్‌కీ విలువైన బహుమతులుకూడా ఇచ్చేవారు ఎలీనాకి. యూనివర్సిటీలో స్నేహితులందరితోనూ గర్వంగా చెప్పుకునేవాడు మాధవ్ తన తల్లిదండ్రులు ఎంత విశాల హృదయులో, ఎంత సంస్కార వంతులో, "వైష్ణవ జనతో ..." అనే గీతాన్ని తన తల్లి ఎంత చక్కగా పాడుతుందో, పిల్లలందరికీ ఎలా నేర్పిస్తుందో చెప్పేవాడు.

'తీరా ఉగాది పండుగనాడు భోజనం చేస్తుండగా, 'ఎలీనా మళ్లీ ఉగాదికి ఎక్కడ ఉంటుందో!' అని తల్లి అనగానే, మాధవ్ మాట వరసకి అన్నట్లుగా 'ఎలీనా ఇంక ముందు ఎప్పటికీ మనింట్లో ఉండేదేకదా' అనేసరికి తల్లిదండ్రులకి ఉగాది పచ్చడిలో తక్కిన రుచులన్నీ పోయి చేదు ఒక్కటే మిగిలినట్లనిపించింది. సంభాషణ పొడిగించకుండా గంభీరంగా కూర్చుని భోజనాలు ముగించారు ఎలాగో.

'అనుకోకుండా మర్నాడు సాయంకాలం ఎలీనాకి టెలిగ్రాం వచ్చింది హాస్టలుకి - తండ్రికి చాలా సీరియస్‌గా ఉంది, తక్షణం బయలుదేరి రమ్మని. ఎలీనా పెద్దనాన్న, మాధవ్ కూడా వెళ్ళి ఎలీనాని రైలెక్కించారు.

'అంతే. ఎలీనా మళ్లీ తిరిగి రాలేదు. పరీక్షలకి కూడా హాజరు కాలేదు. హాజరు కానివ్వలేదు. తండ్రి నిక్షేపంలా ఉన్నాడట. ఎలీనా ఆడపిల్ల కాబట్టి చదువు ఆగిపోయినా, మంచి ఉద్యోగానికి అర్హత పోగొట్టుకున్నా ఫరవాలేదని వాళ్ల ఉద్దేశం అయివుంటుంది. ఎలీనాకి 'హౌస్ ఎరెస్ట్' విధించారు. ఇరువైపుల నుంచీ ఒత్తిడి అంతటితో ఆగలేదు. ఎలీనా పెద్దనాన్న కుటుంబం అద్దెకున్నవాటా ఖాళీచేసి దూరంగా మరో చోటికి మారిపోయింది. ఎక్కడికి మారారో కనుక్కోవడానికి రెండు నెలలు పట్టింది మాధవ్‌కి. ఈ లోగా పరీక్షలకి ప్రిపేరవడం తప్పలేదు. మగవాడు కదా. ఎలాగైనా పరీక్షల్లో బాగారాసి, మంచి ఉద్యోగం సంపాదించి, ఎలీనాని దక్కించుకోవాలనే ఆశయంతో పట్టుదలగా కృషి చేశాడు. ఈలోగా ఎలీనా గురించి ఎంత వాకబు చేసినా ఏ సమాచారమూ అందలేదు. అక్కడ ఎలీనా తల్లిదండ్రులు కూడా ఇల్లు మార్చేశారు. ఎలీనా పెద్దనాన్న ఇంటికి వెడితే మాట్లాడకుండా మాధవ్‌ని




వీధిలోంచే పంపించేశారు రెండు మూడు సార్లు. వాళ్ల మనవడు 'మోజు' వెంటపడితే, వాడిని నాలుగు బాది ఇంట్లోకి లాక్కుపోయారుట.

'ఈ మధ్యనే ఎలీనా ఎలాగో వాళ్ల కజిన్ని మంచి చేసుకుని అతని ద్వారా కబురు చేసింది మాధవ్‌కి తను ప్రస్తుతం ఎక్కడ ఉన్నదీ, ఎలా ఉన్నదీను. అందుకే వీడిప్పుడు బెంగుళూరుకి ప్రయాణమయ్యాడు. ఈ ఊళ్లో ఒక ఇంటర్వ్యూ కోసం వచ్చాడు. ఇక్కణ్ణించి తిరిగి వాళ్ల ఊరు వెళ్లకుండా బెంగుళూరు వెళ్లి ఎలాగైనా ఎలీనాని ఆ నిర్బంధం నుంచి బయటికి లాగాలని వీడి పట్టుదల. ఆ పిల్లని మరిచిపోరా, ఎందుకొచ్చిన గొడవ, జీవితాంతం బాధపడాలి మీ అమ్మానాన్నలతో 'అంటే వినడు'.

'పోనీ, నువ్వు వెళ్లి మాధవ్ తల్లిదండ్రులకి నచ్చచెప్పరాదూ?'

'అదంత సులభం కాదు. మాధవ్ తల్లి నా సొంత చెల్లెలు కూడాకాదు. సొంత చెల్లెలయితే నా మాట వింటుందని కాదు! మా బావగారు, అంటే మాధవ్ తండ్రి చాలా పట్టుదల మనిషి. ఒకళ్లు చెపితే వినేరకం కాదు. స్వతహాగా ఇద్దరూ మంచివాళ్లే, స్నేహస్వభావం ఉన్నవాళ్ళే, అధునికులే. కానీ ఈ విషయంలో

సంప్రదాయాన్ని పట్టుకు వేళ్లాడు తున్నారు. స్నేహానికీ, ఆప్యాయతకీ అడ్డురాని 'మతం' ప్రేమకీ పెళ్లికీ ప్రతిబంధకం ఎందు కవుతుందో నాకర్థం కాదు. సమతాభావం ఉందంటారు. మధ్యలో ఈ రేఖ ఎందుకు గీసుకుంటారో, దాన్ని దాటడానికి ఎందుకంత కటకటలాడతారో నాకర్థం కాదు.'

'అదేం కాదు. అసలు కారణం మత భేదం కాదు నిజానికి, ఈ కేసులో అదే కారణం అనిపిస్తోంది. కానీ అది కేవలం నిమిత్తమాత్రం'.

'నీ గీతా ప్రవచనాలు మాని అసలు కారణం ఏమిటో చెప్పరాదూ?'


'అసలు కారణం అధికారం. తల్లి దండ్రులు కన్న పిల్లలపై చలాయించే అధికారం.పిల్లల జన్మకు వాళ్లు కారకులు కనక ఆ అధికారం జన్మతః వస్తుందను కుంటారు. దానికి తోడు వాళ్లని పెంచి పోషించినందుకూ, పోషణకై తమస్థాయికి మించి ఖర్చుపెట్టినందుకూ తమ హక్కుగా సంక్రమించాలనుకునే అధికారం. వయస్సులో పెద్దవాళ్లు కనక తమ మాటే చెల్లాలన్న అహంకారంతో కూడిన అధికారం. అవును. ఈ త్రిశూలం లాంటి అధికారంతో పిల్లల్ని అదుపులో ఉంచా లనుకుంటారు - "కన్నప్రేమ" పేరుతో.


'మరీ అన్యాయంగా మాట్లాడు తున్నావు. అసలే లాయరివి. పైగా నీకీ విషయంలో అనుభంలేదు. అందుకే ఏకపక్షంగా మాట్లాడుతున్నావేమో ఆలోచించు'.

'అనుభవం అంటే స్వయంగా చేతులు కాల్చుకునే అనుభవమే కానక్కర్లేదు. నా చుట్టూ ఉన్న సమాజంలోని మనుషుల్ని అర్థ శతాబ్దం పాటు గమనిస్తూ వచ్చాను. పరిశీలన ద్వారా అవగాహన చేసుకున్న అనుభవం నాది. నిష్పక్షపాతంగా గమనించిన అనుభవం నాది.'

'అయితే నిష్పక్షపాతంగానే మా మాధవ్ పక్షం వహిస్తున్నావన్నమాట!'

'అవును. మళ్లీమళ్లీ అదే అంటాను. ఇది కేవలం భిన్న మతాల వల్ల పుట్టిన సమస్యకాదు. కులాలు భిన్నమైనవైనా, శాఖలు భిన్నమైనవైనా, ఆర్థిక అంతస్తుల్లో భేదాలున్నా, కుటుంబాల మధ్య భేదాభిప్రాయాలున్నా, తల్లిదండ్రులు పిల్లల




వివాహం విషయంలో తమమాటే నెగ్గాలంటారు. అధికారం చలాయిస్తారు. బెదిరిస్తారు. తమ మాటే పిల్లలు విని తీరాలని పట్టుపడతారు. తమ అభిప్రాయాలే సరియైనవి అనుకోవడమనే కాదు. తమ పరువు ప్రతిష్ఠలూ, తమ ఆధిక్యతా; ముఖ్యంకాని, పిల్లల పురోగతీ, స్వాతంత్ర్యేచ్ఛాకాదు. ఇక్కడే వస్తుంది సంఘర్షణ.'

'సంఘర్షణ లేకుండా జీవితం గడుస్తుందా ఎవరికైనా'? 'ఎలాగడుస్తుంది? ఒక మనిషి మరో మనిషి మీద అధికారం చలాయించాలని ప్రయత్నించినంత కాలం సంఘర్షణ తప్పదు. భర్త భార్యమీదా, తల్లిదండ్రులు పిల్లలమీదా, అన్నతమ్ముడి మీదా, అక్కచెల్లెలిమీదా, అత్తకోడలిమీదా, యజమాని క్రింది ఉద్యోగిమీదా, ఉన్నవాడు లేనివాడిమీదా పెత్తనం చలాయించినంత కాలం సంఘర్షణ పుట్టి తీరుతుంది. సంఘర్షణ ఎప్పుడో ఒకప్పుడు తిరుగుబాటుకి దారితీయక తప్పదు. ఈ సంఘర్షణలూ, ఈ తిరుగుబాట్లూ, ఈ కష్టాలూ కన్నీళ్లూ తప్పవు, అనుభవించాలి. ఒకరి నొకరు ద్వేషించుకుంటూ మనుషు లంతా శత్రువులుగా బతకాలి - అంతేగా నువ్వనేది?'

'వ్యాధికి కారణం తెలిసినప్పుడు దాన్ని నయం చేసుకునే మార్గం, తప్పించుకునే మార్గం కూడా తెలుస్తుంది కదా. అధికారం చూపించకుండా తోటి మనిషిని గౌరవించడం, ప్రేమించడం ఎందుకంత కష్టమవుతుందో మనకి?'

'మనుషుల మధ్య సంఘర్షణ లేకపోతే మీ లాయర్లు ఎలా బతుకుతారు పాపం! అయినా, నీ ప్రశ్నకి సమాధానం దొరికేసరికి మా మాధవ్ రైలు కాస్తావెళ్ళిపోతుంది. ఇకమేం వస్తాం మరి.'

'వస్తామండీ'.

'విష్‌యూ ఆల్‌ది బెస్ట్ మాధవ్! ఏమన్నా సహాయంకావాలంటే అడుగు. ధైర్యంగా ఉండు. కాని తొందరపడకు. ముందు నీ ఉద్యోగం సంగతి చూసుకో. ●